ఘనంగా కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



ప్రతిష్ఠాపనోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని రాజబోల్లారంలో కట్టమైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు సుదర్శన్, వెంకటేష్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశానికి విద్యార్థుల అర్హత

జవహర్‌నగర్: దేశవ్యాప్తంగా నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షలో క్రాంతి కీస్ విద్యార్థులు సీటు సాధించడం అభినందనీయమని క్రాంతి కీస్ అకాడమీ యాజమాన్యం ప్రకటించారు. మేడ్చల్–మల్కాజిగిరికి నూతనంగా కేటాయించిన నవోదయ పాఠశాలలో క్రాంతి కీస్ అకాడమీకి చెందిన 19 మంది విద్యార్థులు ప్రవేశం పొందారని అకాడమీ సెక్రటరీ లావణ్య, డైరెక్టర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ కళ్యాణీ ఓ ప్రకటన ద్వారా తెలిపారు.

అంబులెన్స్‌లో తనిఖీలు



వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ కౌశిక్

ఘట్‌కేసర్: మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) వైద్యుడు కౌశిక్ ఘట్‌కేసర్ అత్యవసర వైద్యవాహనం 108లో గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనంలో ఉన్న అత్యవసర వైద్యపరికరాలను పరిశీలించారు. అంబులెన్స్‌లో ఉన్న ఏఈడీ, ఆక్సిజన్ తదితర పరికరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సేవలు ఆశించిన వారికి తక్షణంగా స్పందించాలని, వారికి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. అంబులెన్స్ పైలట్ భద్రు నాయక్, ఈఎంటీ రమేష్ , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం



జవహర్‌నగర్: ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌకూర్‌కి చెందిన కృతికరెడ్డి (16), ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. కాగా ఈనెల 19న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం తెలిసిన చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోచారం మున్సిపల్ కమిషనర్‌గా నిత్యానంద్

పోచారం: పురపాలక సంఘం కమిషనర్‌గా ఎస్.నిత్యానంద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎల్లంపేట్ నుంచి పోచారానికి ఆయన బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు పోచారం కమిషనర్‌గా పనిచేసిన వీరారెడ్డి సచివాలయానికి బదిలీ అయ్యారు. మున్సిపల్ ఉద్యోగులు వీరారెడ్డికి వీడ్కోలు చెప్పి, నిత్యానంద్‌కు స్వాగతం పలికారు.

జారిపడి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి చేతికి ఫ్యాక్చర్



గాయపడిన పద్మ

మల్కాజిగిరి: దోమల బెడద నివారణకు ఫాగింగ్ చేసే సమయంలో మిషన్ నుంచి డీజిల్ లీకైంది. దీంతో హౌస్ కీపింగ్ సిబ్బంది జారిపడి చేతికి ఫ్యాక్చర్ అయ్యింది. గురువారం ఉదయం కార్యాలయం హౌస్ కీపింగ్‌లో పనిచేసే పద్మ మొదటి అంతస్తుకు వెళ్తుండగా డీజిల్ కనిపించకపోవడంతో కాలుజారి కిందపడింది. ఈ ఘటనలో ఆమె కుడిచేయి మనికట్టు దగ్గర విరిగింది. పక్కనే ఉన్న ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం వెళ్లగా.. విరిగిన చోట సర్జరీ చేయాలని ఇక్కడ ఆ సదుపాయం లేదని చెప్పారు. సర్కిల్ అధికారులు ఈఎస్‌ఐ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోమని చెప్పారు. తాను పేదరాలినని ఈఎస్‌ఐలో చికిత్స చేయించుకుంటే సగం జీతం ఇస్తారని కుటుంబ నిర్వహణ ఎలా జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. నిర్లక్ష్యం వహించిన ఎంటమాలజీ సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కోరుతున్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

అహ్మద్‌గూడ డబుల్ బెడ్రూం కాలనీలో కలెక్టర్ మను చౌదరి పర్యటన



డబుల్ బెడ్రూం కాలనీలో స్థానికులతో కలెక్టర్ మను చౌదరి

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని అహ్మద్‌గూడ డబుల్ బెడ్రూం కాలనీలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూంలో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానన్నారు. విద్యుత్ ఫ్లక్చువేషన్, ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెతో భద్రత, ట్రాన్స్‌ఫార్మర్లను వేరే చోటుకి మార్చడం వంటి సమస్యలు వెంటనే పరిష్కరిస్తామన్నారు.

అభివృద్ధి పనులకు చర్యలు..

వరద నీరు వెళ్లేందుకు పైపులైన్లకు మరమ్మతులు, ఇళ్లలో గోడలు బీటలు వారి నీరు కారడం వంటి సమస్యలు, లిఫ్ట్ మరమ్మత్తులు చేయించడంతో పాటు సెల్లార్‌లోకి నీటి వల్ల ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లలు ఆడుకోవడానికి పార్కు, ఆటవస్తువులు సమకూర్చడమే కాకుండా పార్కు పక్కనే ఉన్న సంపునకు ప్రహరీ ఏర్పాటు చేస్తామన్నారు.

◆ స్కూల్, బస్తీ దవాఖానా, అంగన్‌వాడీ సెంటర్ ఏర్పాటు చేయడానికి పరిశీలిస్తామని, ఆధ్యాత్మికత పెంపొందేలా పలుచోట్ల మందిరం, మసీద్, చర్చి నిర్మించిస్తామని చెప్పారు.

◆ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకుని ఎన్నికలు నిర్వహించి కొంత మందిని ఎన్నుకుని వారి ద్వారా ప్రస్తుత సమస్యలు కాకుండా భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లా హౌజింగ్ అధికారి రమణమూర్తి, కీసర తహసీల్దార్ అశోక్, దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అహ్మద్‌గూడలో..

డబుల్ బెడ్రూంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి



రాంపల్లి డబుల్ బెడ్రూం కాలనీలో పర్యటిస్తున్న సీపీఎం నేతలు

కీసర: నాగారం మున్సిపాలిటీ రాంపల్లి డబుల్ బెడ్రూంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం పార్టీ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి సత్యం అన్నారు. గురువారం డబుల్ బెడ్రూం ఇళ్లలో సీపీఎం నాయకులు పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూం ఇళ్లలోని ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ప్రధానంగా ఆర్టీసీ బస్సు సర్వీసులు పెంచాలని, బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలని, రేషన్‌షాపు ఏర్పాటు చేయాలని, ప్రహరీ నిర్మించాలని, లిఫ్టులు సక్రమంగా పనిచేయడం లేదని, పైఅంతస్తులో స్లాబ్ పగుళ్లు వచ్చి లీకేజీ అవుతుందన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేదంటే ఈనెల 25న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. నాయకులు ఎర్ర అశోక్, బంగారు నర్సింగ్‌రావు, అశోక్, ప్రెమోజీ, శ్రీనివాస్, యూసూఫ్, విజయ్, మహమూద్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ రవీందర్

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లిలో కరెంట్ ఆఫీస్ పక్కన పునర్నిర్మించనున్న కట్ట పోచమ్మ తల్లి దేవాలయానికి మాజీ కౌన్సిలర్ సుర్వి రవీందర్‌గౌడ్ రూ.1.04 లక్షల విరాళాన్ని నిర్వాహకులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. దాతల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఆలయ అధ్యక్షుడు పల్లె భిక్షపతి, కమిటీ సభ్యులు బండ్లగూడ అశోక్‌గౌడ్, సుర్వి శ్రీనివాస్‌గౌడ్, శశాంక్‌గౌడ్, ప్రవీణ్, శ్రీనివాస్‌రెడ్డి, సురేష్, జంగయ్య, పరశురాం, యాదయ్య, కృష్ణమూర్తి, ఘన శ్రీనివాస్, వికాస్‌గౌడ్ తదితరులున్నారు.

నూతన ఒరవడితో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: ఇంజినీరింగ్ విద్యలో అడుగుపెట్టిన విద్యార్థులు నూతన ఒరవడితో ముందుకుసాగాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఓరియెంటేషన్‌డే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ విద్యార్థులకు కల్పించే సదుపాయాలు, భవిష్యత్ అవకాశాలపై వివరించారు. భద్రారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కీసర ఇన్‌స్పెక్టర్‌కు విత్తన గణపతి అందజేత



కీసర: గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరితసేన వ్యవస్థాపకులు జోగినిపల్లి సంతోష్‌కుమార్ చేపట్టిన పర్యావరణ పరిరక్షణలో భాగంగా హరితసేవ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు మాధురి గురువారం కీసర ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, ఎస్సై వెంకటేష్‌లకు విత్తన గణపతిని అందజేశారు. కీసర రామాలయ చైర్మన్ వెంకటేష్, కీసర గ్రామశాఖ అధ్యక్షుడు సీహెచ్.బాలరాజు, ఆంజనేయులు, సతీష్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

కలెక్టరేట్‌లో భక్తి శ్రద్ధలతో బోనాలు

సాక్షి మేడ్చల్ జిల్లా: జిల్లా తెలంగాణ నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ (టీఎన్జీఓస్) జిల్లా అధ్యక్షుడు రవిప్రకాశ్ ఆధ్వర్యంలో బోనాల వేడుకలు కలెక్టరేట్లో అట్టహాసంగా జరిగాయి. గురువారం పోతరాజుల ఊరేగింపులు, డప్పుచప్పుళ్లు, కళాకారుల విన్యాసాలతో ఉద్యోగులంతా కలసికట్టుగా పాల్గొని పండుగకు ప్రత్యేక శోభను చేకూర్చారు. ఈ సందర్భంగా టీఎన్జీఓస్ రాష్ట్ర అధ్యక్షుడు, టీజాక్ చైర్మన్ మారాం జగదీశ్వర్ ఉద్యోగుల సంక్షేమం కోసం స్వయంగా బోనం ఎత్తి అమ్మవారికి సమర్పించారు.రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులు పెద్దసంఖ్యలో హాజరై ఉద్యోగ సంఘాల ఐక్యతను ప్రదర్శించారు. తెలంగాణ ప్రత్యేకతను చాటే బోనాల పండుగను ఉద్యోగ సంఘాలు సాంప్రదాయబద్ధంగా జరుపుకోవడం, ఉద్యోగుల ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. టీఎన్జీఓస్ నాయకులు కస్తూరి వేంకటేశ్వర్లు, సత్యనారాయణగౌడ్, లక్ష్మణ్, భరత్కుమార్, శామ్యూల్‌పాల్, శేషసాయి గిరికాంత్, రవిచంద్రన్, నాగరాజ్, అశ్విని, రూప, సుధీర్‌కుమార్, కొండల్‌రావు, వినయ్‌కాంత్, సజీద్, నజీమా, కార్తీక్, లింగాల అక్షయ్, ఉమాకాంత్ , శ్రీనివాస్, అరుణ , సత్యజ్యోతి, భాస్కర్, మాణిక్యం పాల్గొన్నారు.

గ్రామదేవతలకు బోనాలు

మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని సోమారంలో గురువారం బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు బోనాల పండగను భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించుకున్నారు. గ్రామంలోని గ్రామ దేవతలు పోచమ్మ, ముత్యాలమ్మ, దుర్గమ్మలకు బోనాలను సమర్పించారు. మహిళలు డప్పుచప్పుళ్లు, శివసత్తుల నృత్యాలు, పోతరాజుల వీరంగాలతో గ్రామంలో బోనాల ఊరేగింపు నిర్వహించి అమ్మవార్లకు సమర్పించారు.

వీధి కుక్కలకు వ్యాక్సినేషన్



ఏదులాబాద్‌లో బ్లూక్రాస్ సంస్థ సభ్యులతో ప్రవళిక, ఇన్ఫోసిస్ యాజమాన్యం

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పరిధిలో 400 వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ చేసేందుకు స్థానిక 'ఇన్ఫోసిస్' స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. ఈ మేరకు గురువారం ఏదులాబాద్‌లోని 50 వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ వేసేందుకు 'బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్' వారికి అప్పగించారు. మున్సిపల్ కమిషనర్ రాజేష్, ఆర్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా జంతు సంక్షేమ బోర్డు సభ్యురాలు ప్రవళిక, ఇన్ఫోసిస్ బృందం సభ్యులు వంశీ, శశికాంత్, ఆదిత్య, బ్లూక్రాస్ ఆఫ్ హైదరాబాద్ సీఈఓ కుమారి, రాజేష్, బ్లూక్రాస్ ఆఫ్ హైదరాబాద్ క్యాచింగ్ టీమ్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ సేవలు వినియోగించుకోవాలి

తూంకుంట కమిషనర్ జ్యోతి

శామీర్‌పేట్: మున్సిపల్ ప్రజలు ఇంటిపన్నులు, వాణిజ్య పన్నులను సకాలంలో డిజిటల్ సేవల ద్వారా చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి అన్నారు. గురువారం తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో డిజిటల్ ప్రత్యేక సేవా కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని గృహ, వాణిజ్య యజమానులు తమ పన్నులను చెల్లించేందుకు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సేవా కేంద్రాలను (డిజిటల్ సేవలు) వినియోగిచుకోవాలని సూచించారు. మేనేజర్ శ్రవన్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు స్ఫూర్తిదాయకంగా ఉండాలి

మేడ్చల్: విద్యార్థులు నేటి సమాజంలో స్ఫూర్తిదాయకంగా ఉండాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీలోని కిష్టాపూర్ మల్లారెడ్డి ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ కళాశాలలో గురువారం నిర్వహించిన ఓరియెంటేషన్ డే లో పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో తమ జీవితంలో విలువలను పాటిస్తూనే విజ్ఞానం సంపాదించి తమ జ్ఞానంతో సమాజానికి అవసరమైన సేవలు అందిస్తూ ఆదర్శంగా ఉండాలన్నారు. కళాశాల చైర్మన్ వేముల మల్లారెడ్డి, యాజమాన్య ప్రతినిధులు కిష్టారెడ్డి, భరతసింహారెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ సుబ్బరత్నం, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ మహేష్, డీన్ డాక్టర్ విశ్వనాథన్ పాల్గొన్నారు.

31న రెడ్డి సంఘం ఎన్నికలు

ఘట్‌కేసర్: రెడ్డి సంఘం పదవీకాలం ముగిసినందున ఈనెల 31న నూతన కమిటీ ఎన్నిక నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల అధికారిగా ప్రముఖ న్యాయవాది రాఘవరెడ్డి వ్యవహరిస్తారని, ఈనెల 24, 25న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామినేషన్లు దాఖలు చేసుకోవాలన్నారు. 26న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామినేషన్ల పరిశీలన, 27న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణ, 31న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు, అనంతరం ఓట్ల లెక్కింపు ఉంటుందని, అదనపు సమాచారం కోసం కమిటీ సభ్యులను సంప్రదించాలన్నారు.

ప్రైం ల్యాండ్ అసోసియేషన్ కమిటీ ఏకగ్రీవం



నూతన కమిటీ సభ్యులు

ఘట్‌కేసర్: పట్టణంలోని ప్రైమ్‌ల్యాండ్ వెంచర్‌లోని గణపతి ఆలయంలో వెంచర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీ గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కొమ్మిడి జగన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాజేష్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్‌రెడ్డి, నందుమూర్తి, రమేష్‌పెరిక, అనీల్‌కుమార్, కోశాధికారిగా సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా రాధాకృష్ణ ముదిరాజ్, హరికృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా విజయ్‌కుమార్, రవీందర్, సలహాదారులుగా యాదగిరి యాదవ్, ఆంజనేయులు, దేవేందర్‌ముదిరాజ్, శశిధరణ్, ధన్‌రాజ్ ఎన్నికయ్యారు.

ప్రభుత్వ స్కూళ్లకు ప్రైవేటు సంస్థల తోడ్పాటు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రైవేటు సంస్థలు చేస్తున్న కృషి అమోఘమని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని డబీల్‌పూర్‌లో వన్ స్కూల్ ఎట్ ఏ టైమ్ పేరుతో ఉషాట్ సంస్థ నిర్మించిన ఐదు అదనపు తరగతుల భవనాన్ని ఆయన సంస్థ ప్రతినిధులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ దంపతులు రజితారాజమల్లారెడ్డిలు ఉషాట్ సంస్థను ఒప్పించి గ్రామంలో పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాల కోసం నూతన వసతులు కలిగిన భవనాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. ఉషాట్ సంస్థ రూ.90 లక్షలు వెచ్చించి పేద విద్యార్థులకు అధునాతన భవనం నిర్మించి ప్రైవేటు సంస్థలకు ఆదర్శప్రాయంగా నిలిచారని కొనియాడారు. ఉషాట్‌కు చెందిన బెంగుళూరు నిర్మల జె.వూల్లూరు, డల్లాస్‌కు చెందిన సింక్రాన్ సాఫ్ట్‌వేర్ ఇండియా సంస్థ ప్రతినిధులను ఆయన సన్మానించారు. నర్సింహ్మారావు, వేణుమాధవ్, మాజీ ఎంపీపీ రజిత, మాజీ సర్పంచ్‌లు రాజమల్లారెడ్డి, గీత భాగ్యరెడ్డి, సంజీవరావు, బీఆర్‌ఎస్ నేతలు భాస్కర్ యాదవ్, సత్యనారాయణ, దయానంద్‌యాదవ్, వెంకటేశం, రామోదర్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

నాగారంలో సమన్వయ సమావేశం



మాట్లాడుతున్న కీసర ఆర్డీవో వెంకటఉపేందర్‌రెడ్డి

కీసర: గణేష్ ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని, నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కీసర ఆర్డీవో వెంకటఉపేందర్‌రెడ్డి అన్నారు. వినాయక చవితి సందర్భంగా వినాయక మండపాలు, నిమజ్జన ఏర్పాట్లపై గురువారం నాగారం స్టార్ ఫంక్షన్‌హాల్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక మండపాలకు మున్సిపల్, పోలీస్‌శాఖల ముందస్తు అనుమతి తీసుకోవాలని, విద్యుత్ భద్రత, అగ్నిప్రమాద నియంత్రణ, జనరేటర్లు, సౌండ్ సిస్టమ్‌లపై నిబంధనలు పాటించాలన్నారు. నిమజ్జనానికి ట్రాఫిక్‌శాఖ ప్రత్యేక రూట్‌మ్యాప్, డ్రోన్ కెమెరాల నిఘా, నిమజ్జన కుంటల పరిశుభ్రత, పెద్ద విగ్రహాల నిమజ్జనం కోసం ప్రత్యేక క్రేన్లు తదితర ఏర్పాట్లు సిద్ధం చేయాలని తెలిపారు. నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, అధికారులు, కీసర పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, కమిటీ ప్రతినిధులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నోట్‌బుక్స్ పంపిణీ



ఘట్‌కేసర్: పట్టణంలోని గురుకుల్ జూనియర్, సీనియర్ కళాశాల విద్యార్థినులకు ఎన్ఆర్ఐ కుటుంబీకులు అందజేసిన ఇంటర్మీడియట్ పుస్తకాలను బీజేపీ మున్సిపల్ మాజీ అధ్యక్షుడు హనుమాన్, మాజీ వార్డు సభ్యుడు దేవేందర్‌ముదిరాజ్ గురువారం పంపిణీ చేశారు. పేదలైన ఇంటర్ విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని, ఆ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి విజ్ఞప్తి మేరకు ఎన్ఆర్ఐ కుటుంబసభ్యులు పుస్తకాలు అందజేశారని వారు తెలిపారు.

స్కేటింగ్ చాంపియన్స్ రికార్డు

పోచారం: ఆపరేషన్ సిందూర్, భారత సాయుధ దళాల పరాక్రమం, గౌరవార్థం నగరంలో ప్రపంచ రికార్డు కోసం నిర్వహించిన స్కేటింగ్ ఈవెంట్‌లో నారపల్లిలోని నిహాక్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 79 నిమిషాల పాటు స్కేటింగ్ చేస్తూ.. నిరంతరం సెల్యూట్ చేసిన 12 మంది విద్యార్థులు చాంపియన్లుగా నిలిచి ప్రపంచ రికార్డు సృష్టించారు. చాంపియన్ల జాబితాలో యజ్ఞదీరత్, సాయివర్షిత్, సూరజ్‌రెడ్డి, వైభవ్, సుమిత్ సిర్వి, సాకేత్, అఖిల్‌రెడ్డి, గౌరవేంద్ర, శ్రీనివేద్ బిట్ల, ఆరవ్, అద్వైత్‌గౌడ్ ఉన్నారు.



మెడల్స్‌తో విద్యార్థులు

ఎల్లంపేట్ మున్సిపల్ కమిషనర్‌గా స్వామి



మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపల్ కమిషనర్‌గా స్వామి నియమితులయ్యారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన నిత్యానందం పోచారం కమిషనర్‌గా బదిలీ కావడంతో ఆయన గురువారం రిలీవ్ అయ్యారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న స్వామి ఎల్లంపేట్ కమిషనర్‌గా ఇక్కడికి వచ్చారు.

గుండ్లపొచంపల్లికి వెంకటగోపాల్..

మేడ్చల్‌రూరల్: గుండ్ల పోచంపల్లి మున్సిపల్ నూతన కమిషనర్‌గా వెంకటగోపాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన స్వామి ఎల్లంపేట్ మున్సిపాలిటీకి బదిలీ కావడంతో ఆయన స్థానంలో గజ్వేల్ మున్సిపాలిటీ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటగోపాల్ నూతన కమిషనర్‌గా బదిలీపై వచ్చారు.



నూతన కమిషనర్‌ను సన్మానిస్తున్న అధికారులు

జీహెచ్‌ఎంసీ ఆధీనంలోకి షాపింగ్ కాంప్లెక్స్



కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ జై జవాన్ కాలనీలోని షాపింగ్ కాంప్లెక్స్ ఎట్టకేలకు జీహెచ్‌ఎంసీ ఆధీనంలోకి వెళ్లింది. ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఈ షాపింగ్ కాంప్లెక్స్ ఇన్నాళ్లు కాలనీ సంక్షేమ సంఘం ఆధీనంలో ఉండేది. ఈ షాపింగ్ కాంప్లెక్స్‌ను జీహెచ్‌ఎంసీ స్వాధీనం చేసుకోవాలని గత కొన్నేళ్లుగా స్థానిక నాయకుడు తాడూరి గగన్‌కుమార్ పోరాటం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరుగుతూ విజ్ఞప్తులు చేశారు. చివరకు అధికారులు స్పందించి ఎట్టకేలకు షాపింగ్ కాంప్లెక్స్‌ను స్వాధీనం చేసుకుంటున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో గురువారం జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఎస్టేట్స్ ఆఫీసర్ లావణ్య షాపింగ్ కాంప్లెక్స్ వద్దకు చేరుకుని 10 షెటర్లకు తాళం వేసి స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఇన్నేళ్ల తన పోరాటానికి ఫలితం దక్కిందని, షాపింగ్ కాంప్లెక్స్‌ను జీహెచ్‌ఎంసీ స్వాధీనం చేసుకోవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. గత 12 ఏళ్లుగా అద్దె రూపంలో ఇన్నాళ్లు వసూలు చేసిన సుమారు కోటి రూపాయలను వారి నుంచి ప్రభుత్వం రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై అవసరమైతే తాను న్యాయ పోరాటం చేస్తానని స్పష్టం చేశారు.

భద్రతా ప్రమాణాలపై దృష్టి సారించండి



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: డివిజన్‌లో భద్రతా ప్రమాణాలపై దృష్టి సారించాలని కార్పొరేటర్ శ్రవణ్ విద్యుత్ విభాగం అధికారులకు సూచించారు. గురువారం డీఈ అన్వర్ పాషా, ఏడీఈ చంద్రశేఖర్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సఫిల్‌గూడ నిమజ్జనఘాట్ వెనుక వైపు గేట్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ లేదని, తక్షణమే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనేక చోట్ల ఇంకా ఇనుప స్తంభాలే ఉన్నాయని, వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలన్నారు. కేబుల్, ఇంటర్‌నెట్ కేబుల్స్‌ను తొలగించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవ్వరికీ ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వినాయక విగ్రహాలు తీసుకెళ్లేటప్పుడు విద్యుత్ తీగలు తగలకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.